సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 27 । నవంబర్ । 2023



ప్రాణం తీసిన వేగం
రాజంపేట–రాయచోటి రోడ్డులోని తిరుమల కల్యాణ మండపం సమీపంలో బైకును వేగంగా నడిపి శనివారం రాత్రి పవన్ (20) అనే ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. -8లో



అప్పల బాధతో రైతు ఆత్మహత్య
ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.150	రూ.248

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 397 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	370	430
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 355.320 కిలోలు

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'
రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. ఈ మేరకుఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

మల్లయ్యకొండకు నాలుగు ప్రత్యేక బస్సులు
మదనపల్లె సిటీ: ప్రముఖ శైవక్షేత్రమైన మల్లయ్యకొండకు కార్తీకమాసం పురస్కరించుకుని నాలుగు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈనెల 27, వచ్చే నెల 4, 11 తేదీల్లో తంబళ్లపల్లె మల్లయ్యకొండకు బస్సులు నడవున్నట్లు పేర్కొన్నారు. మదనపల్లె నుంచి ఉదయం 5.30, 6.30, 7.30లకు బయలుదేరి తంబళ్లపల్లె రాగామాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ తిరుగుతాయన్నారు. మరొక బస్సు ఉదయం 5 గంటకు నేరుగా మల్లయ్యకొండకు, మదనపల్లెకు తిరుగుతుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం
కడప కోటిరెడ్డిసర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూజీకేవై పథకం ద్వారా సీ–డ్యాప్ సౌజన్యంతో రాయలసీమ జిల్లాల్లోని గ్రామీణ నిరుద్యోగ యువతకు కడపలో ఉచిత శిక్షణతో కూడిన ఉపాధిని కల్పించనున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల కాల వ్యవధిలో ఉచితంగా కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమెర్జెన్సీ, మెడికల్ టెక్నిషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 90630 82227 నంబరులో సంప్రదించాలన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న కేడెట్స్‌ను అభినందిస్తున్న సీఓ, ఎన్‌సీసీ అధికారులు

వైవీయూ: యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా కోరారు. కడప ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో చివరిరోజు ఆదివారం ముగింపు కార్యక్రమం, ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి ప్రాణదానం చేసినవారవుతామన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. డిప్యూటీ క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ డా. ఆర్. నీలయ్య మాట్లాడారు. అనంతరం రక్తదానం చేసిన ఎన్‌సీసీ కేడెట్స్‌కు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జేబీవీఎస్ ప్రిజర్వర్ స్వచ్ఛందసేవాసంస్థ అధ్యక్షుడు అశోక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారి రమేష్, రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషలాఫీసర్ శివశంకర్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారులు డా. మహేష్, పొన్నతోట రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవం..జ్వాలాతోరణం



పుష్పగిరి చెన్న కేశవ స్వామి ఆలయ ఆవరణలో జ్వాలా తోరణాన్ని వెలిగిస్తున్న భక్తులు

వల్లూరు: పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ఘనంగా పూజలు జరిగాయి. కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, శ్రీ సంతాన మల్లేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వాములకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో దేవస్థానం ఆధ్వర్యంలో జ్వాలాతోరణాన్ని ఏర్పాటు చేశారు. జ్వాలా తోరణాన్ని మైదుకూరు శాసన సభ్యులు శెట్టిపల్లె రఘురామిరెడ్డి తనయుడు నాగిరెడ్డి దంపతులు వెలిగించారు. వివిధ ప్రాంతాల నుండి భారీగా తరలి వచ్చిన భక్తులు పెన్నా నదిలో స్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణం, నదిలో దీపాలను వెలిగించారు. శ్రీ చెన్న కేశవ స్వామి, సంతాన మల్లేశ్వర స్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వాములను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పుష్పగిరి క్షేత్రం శివ నామ స్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు మురళీ మోహన్ రెడ్డి, సబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచ నదీ హారతి: ఆశా రేఖ ఫైండేషన్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయం ఎదురుగా పవిత్ర పినాకినీ నదిలో పంచ నదీ హారతిని ఘనంగా నిర్వహించారు.

ఉజ్వల భవిత!

- ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహం
- అత్యుత్తమ కంటెంట్ ఉన్న ట్యాబ్‌ల పంపిణీకి శ్రీకారం



భవిత కేంద్రం

మదనపల్లె సిటీ: వారంతా మూగ, చెవుడు, చూపు తక్కువ, పూర్తిగా కనపడని పిల్లలు. అయితేనేం అందరితో పాటే తామూ దేనిలోనూ తీసిపోమని నిరూపించుకుంటున్నారు. ప్రభుత్వ సహకారంతో భవిత కేంద్రాల్లో ఉంటూ చక్కగా విద్యాభ్యాసం చేస్తున్నా రు. ఆ విద్యార్థులు మరింత ఉత్తమంగా ఎదిగేలా... ఉన్నత భవితకు బాటలు వేసుకునేలా సహకారం అందించాలని వై.ఎస్.జగన్ సర్కారు నిర్ణయించింది. భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాల పిల్లలకు అత్యుత్తమ కంటెంట్ నిక్షిప్తం చేసిన ట్యాబ్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. వెరసి పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఈ కేంద్రాలు చిరునామాగా నిలుస్తున్నాయి.

- విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణల ఒరవడి కొనసాగుతోంది. విద్యార్థులకు అన్ని రకాలుగా సీఎం జగన్ అండగా నిలుస్తున్నారు.
- జిల్లాలో 30 భవిత కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 560 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు. వీరి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. వారికి కావాల్సిన మెటీరియల్స్ అందజేస్తున్నారు. దీంతో పాటు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నారు. మూగ, చెవుడు, దృష్టిలోపం, పూర్తిగా కనబడని వారు సైతం సాధారణ విద్యార్థుల్లా ఉన్నత విద్యను చదవాలనే ఉద్దేశంతో ఆధునిక సాంకేతికతతో కూడిన ట్యాబ్‌లను

జిల్లాలోని భవిత కేంద్రాలు :	30
ప్రత్యేక అవసరాల పిల్లలు :	560
పంపిణీ చేసే ట్యాబ్‌లు :	143

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు అందజేయనున్నారు.

- ఒక్కో ట్యాబ్ రూ.29 వేలు, కీ బోర్డు 8 వేలు విలువ చేస్తోంది. ఆయా కేటగిరీల చిన్నారులకు సులభంగా చదువుకోవడానికి వీలుగా ట్యాబ్‌లను రూపకల్పన చేశారు. ఇటీవల ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ లాంఛనంగా ప్రారంభించారు.

కంటెంట్ ఇలా..
6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు అనుగుణంగా ట్యాబ్‌లలో కంటెంట్ నిక్షిప్తం చేశారు. బిమై ఐస్, ఎన్ విజన్ ఆల్, గూగుల్ ట్రాన్స్‌క్రైబ్, గూగుల్ లుక్ అవుట్, డాక్స్, సీట్, జీ బోర్డు, ఫిజికల్ కీ బోర్డు, నోట్ ప్యాడ్, గూగుల్ కీ తదితర ప్రత్యేకతలు వీటిల్లో ఉన్నాయి. జిల్లాలో 143 ట్యాబ్‌లను చూపులేని, దృష్టిలోపం, వినికిడి లోపం, ఐఈఆర్టీలకు అందజేయనున్నారు.

ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకోవాలి



ప్రత్యేక అవసరాల పిల్లలకు ఎంతో విలువైన ట్యాబ్‌లు అందజేస్తాం. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.వీటితో దివ్యాంగ విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటికే భవిత కేంద్రాల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించాం. ప్రత్యేక అవసరాల పిల్లలను కూడా సాధారణ విద్యార్థులకు ధీటుగా తీర్చిదిద్దుతాం.

–శ్రీరాం పురుషోత్తం, డీఈఓ,అన్నమయ్య జిల్లా

త్వరలో ఉపాధ్యాయులకు శిక్షణ



ట్యాబ్‌లను అందరికి పంపిణీ చేసిన వెంటనే ఐఈఆర్టీలు, ఐఈడీఎస్ఎస్‌లకు శిక్షణ ఇస్తాం. ట్యాబ్‌లోని కంటెంట్‌ను తెలియజేయడం, ఎలా విద్యార్థులకు నేర్పాలి అనే విషయాలు తెలియజేస్తాం. త్వరలో పూర్తి స్థాయిలో ట్యాబ్‌ల ద్వారా పాఠ్యాంశాలు బోధిన జరుగుతుంది.

–జనార్ధన్, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్

పరిమళించిన ఆధ్యాత్మిక గంధం

గంధం సమర్పించిన పీఠాధిపతి



గంధం, చాదర్ సమర్పిస్తున్న పీఠాధిపతి, చిత్రంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కల్చరల్: ఆ ప్రాంగణమంతా జనసందోహం..ప్రతి రోడ్డులోనూ దాదాపు 100 మీటర్లపాటు కిక్కిరిసిన జనం..అంతటా ఆధ్యాత్మిక సుగంధం....అందరి మనసుల నిండా భక్తి..కడప అమీన్‌పీర్ దర్గా ఉరుసు ఉత్సవాల్లో ప్రధానంగా భావించే ఘట్టాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. హజరత్ సూఫీ సర్ మస్తాని చిల్లాకష్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రీ సాహెబ్ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తన నివాసం నుంచి అలంకరించిన గంధం కలశంతో ఫకీర్ల మేళతాళాలు, సాహస విన్యాసాల మధ్య ఊరేగింపుగా దర్గాలోని గురువుల మజార్ వద్దకు తరలి వెళ్లారు. గంధం సమర్పించి ఫాతెహా నిర్వహించారు. పలువురు ప్రముఖులు ఆయన వెంట ఉన్నారు. ముషాయిరా హాలులో దర్గా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంస్థల వార్షిక నివేదికతోపాటు అమీన్ ఎడ్యుకేషనల్ ట్రస్టు విశేషాలను, విజయాలను నిర్వాహకులు పీఠాధిపతికి సమర్పించారు. ఈ సందర్భంగా అమీన్ ఐటీఐలో ప్రతిభ చూపిన విద్యార్థుల గురించి ఐటీఐ ప్రతినిధులు వివరించారు. వారికి ఐదుగురికి ప్రశాంత పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

దీక్షలో మలంగ్‌షా

ఈ సందర్భంగా మలంగ్‌షాను పీఠాధిపతి దీక్ష వహింపజేశారు. దర్గా నుంచి కడపలోని ముఖ్య కూడళ్ల మీదుగా వెళ్లిన మలంగ్‌షా, అనుచర బృందం నాగరాజుపేటలోని బాదుల్లాసాహెబ్ మకాన్‌కు చేరింది. మకాన్ నిర్వాహకులు, స్థానిక భక్తులు వారిని స్వాగతించారు. సాయంత్రం ఆ బృందం ఊరేగింపుగా తిరిగి దర్గాకు చేరుకుంది. రాత్రి మలంగ్‌షా దర్గా ఆవరణంలోని పీర్లచావిడిలో దీక్ష వహించారు. దర్గా పీఠాధిపతి స్వయంగా వెళ్లి ఆయనకు సంప్రదాయబద్ధంగా దీక్ష వహింపజేశారు.

భక్తులకు ఏర్పాట్లు

ఉరుసులో ప్రధాన ఘట్టమైన గంధం ఉత్సవానికి దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నిర్వాహకులు వారందరికీ వసతితోపాటు భోజన సౌకర్యం కల్పించారు. దుకాణాల వద్ద కూడా జనం సందడి కనిపించింది.



పెద్దదర్గా ఆవరణలో భక్తుల సందడి

వైభవంగా భద్రకాళీ సమేతుడి కల్యాణం



శ్రీ భద్రకాళీ సమేతుడి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ప్రధాన అర్చకులు, దాతలు

రాయచోటిటౌన్ : శివనామస్మరణలతో శైవక్షేత్రాలు మార్మోగాయి. ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాలలో కార్తీక దీపారాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలం రెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలోఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్యస్వామి, శంకరయ్య స్వామి, రాచరాయ యోగీ స్వామి వారి ఆధ్వరంలో ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవానికి స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా తరలి వచ్చారు. అఘోరలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. శివాలయంలో కార్తీక దీపాల వేడుకలలో అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి దంపతులు దీపాలు వెలిగించిపూజలు నిర్వహించారు.



శ్రీ భద్రకాళీ సమేతుడి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మానసిక వైద్యంతో ఇండ్లకు ఖ్యాతి



ఇండ్ల రామసుబ్బారెడ్డి దంపతులను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

కడప రూరల్ : మానసిక వైద్యంలో విశేషంగా కృషి చేసి దేశ వ్యాప్తంగా ప్రముఖ వైద్యులుగా గుర్తింపు పొందిన వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డి సేవలు అభినందనీయం. ఆయన మానసిక రోగులకు అందించిన సేవలకు గుర్తుగా వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వరించడం ప్రశంసనీయమని వక్తలు అన్నా రు. ఆదివారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో అవార్డు గ్రహీత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డికి ఆహ్వానసంఘం ఆధ్వర్యంలో అభినందనసభను నిర్వహించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ సి.బాలిరెడ్డి అధ్యక్షతన జరిగిన సన్మానసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాకు చెందిన సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి వైద్య రంగంలో రాణించడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఆయన లక్షలాది మంది మానసిక రోగులకు వైద్య సేవలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ ఒక మానసిక వైద్యశాల ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారన్నారు. ఈ అంశాన్ని తాము సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన స్పందించి ఇక్కడ సైక్రియాటిస్టు ఆస్పత్రిని కేటాయించారన్నారు. ఆ ఆస్పత్రి సీఎం చేతుల మీదుగా డిసెంబరులో ప్రారంభం కాబోతున్నందుకు సంతోషంగా ఉంద న్నారు. ఇప్పటివరకు మానసిక వ్యాధిగ్రస్తులు చికిత్స కోసం హైదరాబాదు తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లేవారన్నారు. ఇప్పుడు కడప కేంద్రంగా మానసిక వ్యాధిగ్రస్తులకు వైద్య చికిత్సలు లభించనున్నాయని తెలిపారు. కాగా, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డికి తాను చేస్తున్న వైద్య సేవలకు గుర్తింపుగా పద్మశ్రీ అవార్డును కేటాయించాలన్నారు. ఈ అంశాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతామన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, తాను బాల్య మిత్రు లమని గుర్తు చేశారు. అవార్డు గ్రహీత రామసుబ్బారెడ్డికి స్వగ్రామం గుడిపాడులో త్వరలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం అవార్డు, సన్మాన గ్రహీత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్ల కిందట వైఎస్సార్ జిల్లా నుంచి అందులోనూ రాయలసీమ ప్రాంతం నుంచి విజయవాడకు వెళ్లి మానసిక వైద్యశాలను ఏర్పాటు చేయడం అరుదైన విషయమన్నారు. తన వైద్య సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం అరుదైన వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం ఆహ్వానసంఘం ఆధ్వర్యంలో అవార్డు గ్రహీత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, రాధారెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు.

27 నుంచి శాస్త్రవేత్తల పర్యటన

- ప్రకృతి వ్యవసాయంపై గ్రామాల సందర్శన
- చిన్నమండెం, వాల్మీకిపురం మండలాలలో పర్యటన



రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ఈ నెల 27, 28వ తేదీల్లో ప్రకృతి వ్యవసాయంపై ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన శాస్త్రవేత్తల బృందం పర్యటించనున్నట్లు ఏపీ రైతు సాధికార సంస్థ (ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) తెలియజేసింది. ఈ మేరకు ఆదివారం ఈ మేరకు విజయవాడ కార్యాలయం నుంచి అన్నమయ్య జిల్లా అధికారులకు సమాచారం అందింది. అందులో పేర్కన్న వివరాల ప్రకారం.. జిల్లాలోని చిన్నమండెం మండలం చిన్నర్సుపల్లె, వాల్మీకిపురం మండలం అయ్యవారిపల్లి గ్రామాలలో పర్యటిస్తారు. రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో విస్తృతంగా సమర్థవంతంగా ప్రకృతి సూత్రాలకు అనుగుణంగా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు గ్లోబల్ స్థాయి గుర్తింపు పొందిన (అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధనా సంప్రదింపుల సమూహం) శాస్త్రవేత్తల బృందం ఈ పర్యటనలో పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్రంలో కరువు ప్రాంతంగా పేరొందిన రాయలసీమ జిల్లాల పర్యటనలో భాగంగా జిల్లాలో 18 మందితో కూడిన సీజీఐఏఆర్ బృందం జిల్లాలో పర్యటించి ప్రకృతి వ్యవసాయంలో అమలవుతున్న ఆదర్శ క్షేత్రాలను సందర్శిస్తారు. ఈ నెల 27వ తేదీన బెంగళూరు విమానాశ్రయం నుంచి బయలుదేరి రోజుకో గ్రామం చొప్పున జిల్లాలోని 2 గ్రామాలను సందర్శిస్తున్నట్లు సమాచారం.

- 27వ తేదీన తొలి రోజున చిన్నమండెం మండలంలోని చిన్నర్సుపల్లె గ్రామంలో పర్యటిస్తుంది.
- 28న వాల్మీకిపురం మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా ఏ గ్రేడ్‌మరియు ఏటీఎం మోడల్స్‌ను సందర్శించి రైతులతో చర్చిస్తారు. అనంతరం యువ రైతులు, రైతు శాస్త్రవేత్తలు, మెంటార్‌లు, నిరుపేదలు తదితర గ్రూప్‌లతో విడివిడిగా మాట్లాడి ప్రకృతి వ్యవసాయ విధానాల గురించి, కలిగే ప్రయోజనాల గూర్చి సవివరంగా తెలుసుకొంటారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో:

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం(ఏపీసీఎన్ఎఫ్) ప్రాజెక్టు పేరుతో విజయవంతంగా అమలు చేస్తోంది. రాష్ట్రంలో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. ఈ నేపథ్యంలో లావోస్ పీడీఆర్, భారత్, కెన్యా, జింబాబ్వే, సెనెగల్, బుర్కినా ఫాసో, ట్యునీషియా, పెరూ(మొత్తం 8)దేశాలకు చెందిన 60 మందితో కూడిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఇతర వాటాదారుల అధ్యయన బృందం 'ద్వైవార్షిక విరామం మరియు ప్రతిబింబం'లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను అర్థం చేసుకోవడానికి సందర్శించడం విశేషం. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సిరాడ్, వరల్డ్ షిప్, అలయన్స్ బయోడైవర్సిటీ, ఇస్రా, అంతర్జాతీయ నీటి యాజమాన్య సంస్థ(ఐడబ్ల్యుఎంఐ), ఓఇఫి, ఇనెరా, సీఐఎంఎంవైటీ సంస్థల ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు. సీజీఐఆర్ ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయరంగంలో చోటు చేసుకునే నూతన ఆవిష్కరణలపై 15 అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల ద్వారా పనిచేసే 9 వేల మంది శాస్త్రవేత్తలతో కూడిన అతి పెద్ద నెట్‌వర్క్ సంస్థగా పనిచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ వ్యవసాయ శాస్త్ర ఉద్యమం ఊపందుకుంటున్న నేపథ్యంలో సీజీఐఎఆర్ చొరవ తీసుకొని 8 దేశాలలో పర్యావరణ పరిరక్షణకు దోహదపడే వ్యవసాయ విధానాలను అధ్యయం చేస్తోంది. ఆహార భద్రతను పెంపొందించడం, గ్రామీణపేదరిక నిర్మూలన, పౌష్టికాహార ఉత్పత్తి, మానవాళి ఆరోగ్యం, సహజ వనరుల పరిరక్షణ లక్ష్యంగా చేసుకొని ఈ సమస్త అధ్యయనాలు చేపడుతుంది. అధ్యయన ఫలితాల నుంచి వచ్చిన సాక్ష్యాలను విధాన రూపకర్తలకు, భాగస్వాములకు అందిస్తుందని ఏపీ రైతు సాధికార సంస్థ తెలియజేసింది.

బృందం సభ్యులు వీరే
జిల్లాలో పర్యటించే బృందంలో బోకో మిచెల్‌ఒరౌన్లాడ్జి, సోలేమానే సనోగో, సోలేమానే ఓడ్రాగో, ఎటియెన్‌సోడ్రే, డిజైర్ ఔటారా, హతికొనాటే, ఎరిక్ వాల్, మార్క్ ఫిరాక్స్, మోడో గ్యూ ఫాల్, బన్నా ఎంటాయే, మామే బీరమ్ సెనే, ఉడో రుడిగర్, హతేమ్‌చెక్‌మద్రీ, హైతెమ్ బహ్రీ, జిద్ ద్రెఫ్, అనిస్ జైమ్, అస్మా సౌయిస్సీ, శ్వేతా గుప్తాలు ఉంటారు.

రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత



అధికారులతో కలసి ప్రతిజ్ఞ చేస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్

రాయచోటిటౌన్ : రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యతని అందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం భారత జాతీయ రాజ్యాంగ, న్యాయ (లా దినోత్సవం) వేడుకల్లో పాల్గొనిప్రసంగించారు. అన్ని వర్గాల సంక్షేమ, అభ్యున్నతి, అభివృద్ధిని కాంక్షించి రాజ్యాంగ గ్రంధాన్ని రక్షించి 1949నవంబర్ 26వ తేదిన జాతికి అంకితం చేసి భారత రాజ్యాంగ నిర్మాతగా, ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ అన్నారు. ఇదే రోజును జాతీయ న్యాయ దినోత్సవంగా, వరకట్న వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించుకోవడం జరుగుతోందని తెలిపారు. త్యాగానికి, కృషి, పట్టుదల, నిజాయితీ , నిబద్ధతకు అంబేద్కర్ నిదర్శనమని కొనియాడారు. భారతీయ జీవన గమనాన్ని ప్రతిబింబించే విలువైన సాధనమే మన రాజ్యాంగమని డీఆర్‌వో సత్యనారాయణ అన్నారు. అనంతరం మన రాజ్యాంగాన్ని కాపాడుకొందని అధికారులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ, ఏవో బాలకృష్ణ, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పీటీఎం మండలం బూర్లపల్లె పంచాయతీ పిడిమివారిపల్లెకు చెందిన మంజునాథరెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి(19) తన అమ్మమ్మ ఊరైన తుమ్మణంగుట్ట పంచాయతీ ఉరికేసిపల్లెలో ఉంటూ ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఆదివారం తన తల్లి ఈశ్వరమ్మ వస్తోందని వెంట తీసుకు వచ్చేందుకు వెళుతున్నానని చెప్పి పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో బి.కొత్తకోట ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా మదనపల్లె పట్టణం సైదాపేటకు చెందిన నవాజ్ భార్య ఆయేషా (28) కుటుంబ సభ్యులతో గొడవపడి శనివారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

హోరాహోరీగా అండర్-23 జోనల్ మ్యాచ్‌లు

- ఆధిక్యంలో సెంట్రల్ జోన్
- సెంచరీ సాధించిన ధరణినాయుడు



తలపడుతున్న నార్త్‌జోన్, రెస్ట్ ఆఫ్ జోన్ జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాలు వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జోనల్ మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. కేఎస్ఆర్ఎం మైదానంలో రెండోరోజు ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో 82 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన సౌత్‌జోన్ జట్టు 92.2 ఓవర్లలో 362 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని టి. వంశీకృష్ణ 69 పరుగులు, బి. యోగానంద 65 పరుగులు, ఇ.ధరణినాయుడు 188 బంతుల్లో 20 ఫోర్లు, 2 సిక్సర్లతో 133 పరుగులతో రాణించారు. సెంట్రల్ జోన్ బౌలర్లు వెంకటసుమిత్ 3, భువనేశ్వర్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సెంట్రల్ జోన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 13.1 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 26 పరుగులు చేసింది. జట్టులోని ఎం. వంశీకృష్ణ 14 పరుగులతో క్రీజులో ఉన్నాడు. కాగా సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 374 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ జట్టు 48 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో 162 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నార్త్‌జోన్ జట్టు 59.3 ఓవర్లలో 272 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రవికిరణ్ 97 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్లు చెన్నారెడ్డి 4, జానీబాషా 5 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 58 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 137 పరుగులు చేశారు. జట్టులోని రేవంత్‌రెడ్డి 63 పరుగులతో క్రీజులో ఉన్నాడు. కాగా రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.



133 పరుగులు చేసిన సౌత్‌జోన్ బ్యాట్స్‌మన్ ధరణినాయుడు

ప్రాణం తీసిన వేగం

ఇంటర్ విద్యార్థి దుర్మరణం



మృతిచెందిన పవన్

రాజంపేట : రాజంపేట-రాయచోటి రోడ్డులోని తిరుమల కల్యాణ మండపం సమీపంలో బైకును వేగంగా నడిపి శనివారం రాత్రి పట్టణంలోని తుమ్మల అగ్రహారానికి చెందిన పవన్ (20) అనే ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. అయితే ఇతని వెంట బైకుపై ఉన్న చిట్వేలి మండలం మల్లెపల్లెకు చెందిన కసూరి రోహిత్ (18)కు గాయాలయ్యాయి. ఉదయం వరకు పవన్ మృతదేహం వద్ద ఇతను అపస్మారక స్థితిలో పడివుండటం గమనార్హం.

ఈ ప్రమాదాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా మృతుని తండ్రి, తల్లి శ్రీశైలం వెళ్లినట్లు సమాచారం. మృతుని సంబంధీకులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన యువకుడిని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. మృతుడు పట్టణంలోని నలందా స్కూల్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు.

బహిరంగ ప్రదేశాలలో..

కాగా రాజంపేట-రాయచోటి రోడ్డులో బహిరంగ ప్రదేశాలలో మద్యంప్రియుల బ్యాచ్‌లు అధికమయ్యాయి. పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జానీబాషాపురం, కూచివారిపల్లె దాటిన తర్వాత పరిసర ప్రాంతాల్లో ఖాళీ ప్రదేశాలలో ఓపెన్‌బార్లు తరహాల్లో రాత్రి వేళలో పట్టణానికి చెందిన యువకులు గుంపులు, గుంపులుగా చేరి మద్యం సేవిస్తున్నారు. ఫలితంగా ప్రమాదాలు, ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలకు దారితీస్తోందన్న విమర్శలున్నాయి.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యవస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

పాఠశాల చాలా బాగుంది



మా పాఠశాల చాలా బాగుంది. గతంలో సరైన సౌకర్యాలు ఉండేవి కాదు. ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలకు అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం నాడు-నేడు పనులతో అన్ని సౌకర్యాలు కల్పించింది. దీంతో పాఠశాలకు కార్పొరేట్ హంగులు వచ్చాయి. ప్రతి తరగతి గదిలో డ్యూయల్ బెంచ్‌లు, ప్యానల్ బోర్డులు ఏర్పాటు చేశారు. పదో తరగతిలో మా పాఠశాల విద్యార్థి వేల్పుల నందిని 586 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో టాపర్‌గా నిలిచింది. గతంతో పోల్చితే ప్రభుత్వ విద్యతో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తున్నాము.

-పురం వెంకటరమణ, ఉపాధ్యాయుడు, వివేకానంద (మాయబజార్) మున్సిపల్ ఉన్నత పాఠశాల, మదనపల్లె

జగనన్న సురక్షతో ఉచితంగా సర్టిఫికెట్లు



గతంలో ఆదాయ, కుల, జనన ధ్రువీకరణ పత్రాల కోసం ఎంఆర్‌ఓ కార్యాలయానికి కాళ్లు అరిగేలా తిరిగేవాళ్లం. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక జగనన్న సురక్ష కార్యక్రమం పెట్టి వలంటీర్లు గ్రామ సచివాలయంలోనే కుల, ఆదాయ, జనన, మరణ సర్టిఫికెట్లు అందించారు. మాకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేసి ఆఫీసుల చుట్టూ తిరగకుండా చేసి జగనన్న దేవుడయ్యాడు. జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

- జాలా కృష్ణవేణి, జీఎంఆర్ కాలనీ, మద్దిరేవుల గ్రామం, లక్కిరెడ్డిపల్లె మండలం

సొంత ఇంటి కల నెరవేరింది



నాకు వివాహమై దాదాపు 13 ఏళ్లు అయినా అప్పటి ప్రభుత్వం నాకు ఇల్లు మంజూరు చేయలేదు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చాడు. అందులోనే ఇంటి నిర్మాణం కూడా చేయించాడు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సొంత ఇంటి కలను సీఎం జగన్ మోహన్ రెడ్డి నెరవేర్చారు. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. -వసుంధర, ఒంటిమిట్ట

నీట మునిగి రైతు మృతి



మృతిచెందిన సురేంద్ర

కేవీపల్లె : ప్రమాదవశాత్తు నీట మునిగి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని తిమ్మాపురంలో చోటు చేసుకుంది. తిమ్మాపురం పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన పూజారి సురేంద్ర (50) ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో గ్రామం సమీపంలో బాహుదా నదిలో చెక్ డ్యాం నీటిలో ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. సురేంద్ర ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం గాలించారు. నదిలోకి వెళ్లినట్లు ఆనవాలు ఉండడంతో పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ లోకేష్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకుల భాస్కర్‌నాయుడు పర్యవేక్షణలో గాలింపు చర్యలు చేపట్టారు. సురేంద్ర మృతదేహం నీటిలో గుర్తించి వెలికితీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య భారతమ్మ తోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడ్డ రైతు సుబ్రమణ్యంరెడ్డి

మదనపల్లె : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎం పంచాయతీ రేగంటివారిపల్లెకు చెందిన వై.రామచంద్రారెడ్డి కుమారుడు వై.సుబ్రమణ్యంరెడ్డి(35) వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. భార్య స్వాతి డ్వాక్రా సంఘమిత్రగా పని చేస్తోంది. కుటుంబ, వ్యవసాయ అవసరాల కోసం పలువురి వద్ద అప్పులు చేశాడు. పంటలు సక్రమంగా పండకపోవడం, సమయానికి అప్పులు తీర్చలేక పోతుండటంపై అనుక్షణం మథన పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబంలో సైతం చిన్నపాటి సమస్యలు నెలకొన్నాయి. దీంతో మనస్థాపం చెంది ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్.ఐ సుధాకర్ సంఘటనా స్థలానికి వెళ్లి ఆత్మహత్యకు గల కారణాలు సేకరించారు. మృతుని భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతునికి కొడుకు యశ్వంత్‌కుమార్‌రెడ్డి(11), కుమార్తె ఊహశ్రీ(10) ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి LiFE Lifestyle for Environment

ప్రాంతీయ కార్యాలయం, కడప, డి.నెం.1/2277, 2వ అంతస్తు, రాజీవ్ పార్క్ రోడ్డు, ఏ.పి.హౌసింగ్ బోర్డు కాలనీ, కడప, వైయస్ఆర్ జిల్లా- 516003. ఈమెయిల్: rokdp-ee1@appcb.gov.in

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

భారత ప్రభుత్వము, పర్యావరణము, అడవులు & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, ప్రకటన నెం.ఎస్.ఓ.1533, తేది: 14.09.2006 మరియు తదుపరి సర్క్యులర్స్‌కు అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారు "మెస్సర్స్ ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ లిమిటెడ్ (APMDC) " వారు వైయస్ఆర్ జిల్లా, బ్రహ్మంగారిమఠం మండలం, పలుగురాళ్లపల్లి గ్రామంలోని సర్వే నెం.2229/పి నందు 24.50 హెక్టార్లలో 6,075 టిపిఏల సామర్థ్యం గల బెరైటీస్ మైనింగ్ చేయుట కొరకు ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన జారీ చేయబడినది.సదరు ప్రపోనెంట్ ప్రతిపాదించిన ప్రాజెక్టుకు సంబంధించిన వివరములు క్రింద తెలుపబడినవి.

1. కంపెనీ పేరు, టెలిఫోన్ నెం. మరియు చిరునామా	మెస్సర్స్ ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ లిమిటెడ్(APMDC), సర్వే నెం. 2229/పి, పలుగురాళ్ళపల్లి గ్రామం, బ్రహ్మంగారి మఠం మండలం, వైయస్ఆర్ జిల్లా, ఫోన్: 9491035727
2. ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రదేశం & భూమి విస్తీర్ణం	సర్వే నెం. 2229/పి, పలుగురాళ్ళపల్లి గ్రామం, బ్రహ్మంగారిమఠం మండలం, వైయస్ఆర్ జిల్లా, మొత్తం మైను లీజు విస్తీర్ణం : 24.50 హెక్టార్లు
3. సంప్రదించవలసిన అధికారి పేరు, చిరునామా మరియు ఫోన్ నెంబరు	శ్రీ టి.వాథసీల్, జనరల్ మేనేజర్, (ప్లానింగ్ & కో-ఆర్డినేషన్), మెస్సర్స్ ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ లిమిటెడ్ డి.నెం.294/1డి, తాడిగడప టు ఎంకిపాడు 100 అ. రోడ్డు, కామూరు గ్రామం, పెనమలూరు మండలం, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా, ఫోన్: 9491035727
4. ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	రూ. 80.0 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాలు	బెరైటీస్ మైనింగ్ కొరకు
6.ఎన్విరాన్‌మెంటల్ కన్సల్టెంట్లు	మెస్సర్స్ టీం ల్యాబ్స్ & కన్సల్టెంట్స్, బి-115 టు 117 & 509, అన్నపూర్ణ బ్లాక్ ఆదిత్య ఎన్‌క్లేవ్, అమీర్‌పేట, హైదరాబాద్ - 500038
7. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 29.12.2023 సమయం : ఉ.11.00గంలకు ప్రదేశం : "ప్రతిపాదిత మైను స్థలం దగ్గర, పలుగురాళ్ళపల్లి గ్రామం, బ్రహ్మంగారిమఠం మండలం, వైయస్ఆర్ జిల్లా

8. ప్రతిపాదిత ప్రాజెక్టుకు సంబంధించిన వివరములు సదరు ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సమ్మరీ (తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ EIA/EMP రిపోర్టు ప్రజల సౌకర్యార్థం ఈ క్రింద కార్యాలయములలో లభ్యపరచబడినది.
i. జిల్లా కలెక్టరు & జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, కడప, వైయస్ఆర్ జిల్లా .
ii. ముఖ్య కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము, జిల్లా పరిషత్, కడప, వై.యస్.ఆర్. జిల్లా .
iii. జనరల్ మేనేజర్ వారి కార్యాలయము, జిల్లా పరిశ్రమల కేంద్రం, కడప, వైయస్ఆర్ జిల్లా
iv. MoEF & CC, GoI వారి కార్యాలయము, ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీస్ (ఐఆర్ఓ), పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
v. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, క్షేత్రీయ కార్యాలయము, బి.ఆర్.కాలనీ, కర్నూలు.
vi. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కడప, వై.యస్.ఆర్.జిల్లా .
vii. తహశీల్దార్ వారి కార్యాలయము, బ్రహ్మంగారిమఠం మండలం, వైయస్ఆర్ జిల్లా .
viii. పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ కార్యాలయం, పలుగురాళ్ళపల్లి గ్రామం, బ్రహ్మంగారిమఠం మండలం, వైయస్ఆర్ జిల్లా

ప్రభావిత ప్రాంతాల ప్రజలు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు ఏవైనా ఉన్నట్లయితే ఈ ప్రకటన ప్రచురించిన 30 రోజులలోగా వ్రాత పూర్వకంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి, కడప, వై.యస్.ఆర్. జిల్లా వారికి పంపవచ్చును. మరియు/ లేదా పైన తెలిపిన తేదీన, ప్రదేశమున బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలుపవచ్చును.

ప్రదేశం : కడప
తేది : 27.11.2023

సం/- ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కడప, వై.యస్.ఆర్. జిల్లా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకటరామిరెడ్డి

రామాపురం: మండలంలోని రాచపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంపీ యూపీ పాఠశాల వద్ద ఈనెల 19న బైకు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో మొరం వెంకట్రామిరెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి ఆదివారం తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కట్టెలు కొడుతూ.. చెయ్యి నరుక్కున్న రైతు

మదనపల్లె : కట్టెలు కొడుతూ ప్రమాదవశాత్తు రైతు చెయ్యి నరుకున్న సంఘటన ఆదివారం ములకలచెరువు మండలంలో జరిగింది. పెద్దపాళెం పంచాయతీ రామానాయునికోటకు చెందిన రైతు ఉత్తన్న (62) ఇంటి వద్ద కట్టెలు కొడుతూ ప్రమాదశాత్తు తన చెయ్యిని బలంగా నరుకున్నాడు. ప్రమాదంలో చేతికి తీవ్ర గాయం కాగా కుటుంబ సభ్యులు 108 వాహనంలో మదనపల్లెకు తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు.

మద్యం మత్తులో ఆకతాయిల హల్‌చల్



బెంగుళూరు బస్టాండులో ఇన్నోవా వాహనంలోని ఆకతాయిలను చూస్తున్న స్థానికులు

మదనపల్లె : మద్యం మత్తులో ఆకతాయిలు ఉదయం పట్టణంలోని బెంగళూరు బస్టాండులో హల్‌చల్ చేశారు. వాహనాన్ని అతివేగంగా నడుపుతూ బస్టాండులో గందరగోళం సృష్టించారు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో బెంగళూరు బస్టాండులో రద్దీ నెలకొని ఉండగా ఇన్నోవా వాహనం అత్యంత వేగంగా బస్టాండులో వచ్చి ఆగింది. అందులో నుంచి ఐదుగురు యువకులు కిందకు దిగి గట్టిగా కేకలు వేసి హల్‌చల్ చేశారు. ప్రజలందరి చూపు వారిపై పడి ఏం జరుగుతుందో అని గందరగోళ పరిస్థితిలో ఉన్నారు. దీంతో డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఆకతాయిలను మందలించి పంపారు. అయితే వారు అంతటితో ఆగకుండా అతివేగంగా నిర్లక్ష్యంగా నడుపుతూ ముందుకెళ్లి ఎదురుగా వస్తున్న వృద్ధుడిని ఢీకొట్టారు. అతడు స్వల్పంగా గాయపడ్డాడు. అక్కడి నుంచి మరింత వేగంగా ముందుకెళ్లి టౌన్‌బ్యాంకు చర్చి వద్ద మరో వాహనాన్ని ఢీకొట్టారు. ఇంతలో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆకతాయిల నుంచి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆకతాయిల తీరుతో బస్టాండులోని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. వీరిపై డ్రైండోవర్ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

నా బిడ్డను ఆదుకోండి.!



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్‌కుమార్

మదనపల్లె సిటీ : కుటుంబానికి అండగా ఉన్న బిడ్డకు అకస్మాత్తుగా అనారోగ్యం చేసింది. ఆస్పత్రిలో చేరిస్తే పెద్ద జబ్బు కావడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. అసలే నిరుపేదలు కావడంతో బిడ్డను బతికించుకోవడానికి పడరాని కష్టాలు పడుతున్నారు. మదనపల్లె పట్టణం మంజునాథకాలనీకి చెందిన పి.ఆర్. వాసు, మంజుల స్థానిక మాయబజారులో చిన్న చిల్లరదుకాణం పెట్టుకుని జీవిస్తున్నాడు. ఇతనికి ఒక కుమారుడు కిరణ్‌కుమార్, కుమార్తె శృతి ఉన్నారు. కుమారుడు కిరణ్‌కుమార్ ఎలక్ట్రిషియన్ పనులు చేస్తూ కుటుంబానికి అండగా ఉన్నాడు. ఈ క్రమంలో ఇటీవల జ్వరం ఎక్కువ కావడంతో ఆస్పత్రికి వెళ్లారు. ఆస్పత్రిలో వైద్యులు పరీక్షలు చేసి ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయని పెద్ద ఆస్పత్రికి వెళ్లాలని తెలిపారు. దీంతో తిరుపతి వెళ్లగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు వెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో ఇప్పటి వరకు రూ.13 లక్షలు బిల్లు చెల్లించాలని వైద్యులు చెప్పారు. దీంతో చేసేది లేక వాసు స్థానిక ప్రెస్‌క్లబ్‌కు వచ్చి తన బాధను తెలియజేశాడు. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

■రాపూరు మెగాసిటీ : రాపూరు బద్వేల్ హైవే టోల్ ప్లాజా ఆనుకొని ఉన్న లే అవుట్‌లో 3.5 లక్షలకే ప్లాట్లు అమ్మకానికి కలవు. వివరములకు సంప్రదించండి: 99633 24455. [NA-11589]

SERVICE

BUSINESS OFFER

■కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9311685170. [T-1258784]

CHANGE OF NAME

■ I, MEDA HARINATH BABU S/o Guruvaiah, R/of 41-444-3, New Ramalayam Street, Shankarapuram, Kadapa, A.P. Now I Changed My Name as Meda Harinatha Babu (New Name) [T-777378]

■ I, SAYED MAHAMOOD S/o Sayed Khajahussain, R/of 21/479-C, KHM Street, Proddatur, A.P. Now I Changed my Name as Syed Mahamood (New Name) [T-777379]

బంగారం కొనబడును

■మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V- 5969]

■ష్యూరిటీ, సెక్యూరిటీ, వ్యక్తిగత, వ్యాపార, వ్యవసాయంపై అతి తక్కువ వడ్డీతో రుణం ఇవ్వబడును. Mr. Rohit Wonder Capital PH: 9041114468 [W-788953]

■ Wanted Sales Executives, Spareparts Incharge, Lady receptionist Intrested Candidates can walk in Sri Durga motors Vinayaka Nagar, Kadapa ✆9030558863 [C-1187781]

■ కడపలో ఊటుకూరు వద్ద గల శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయములో పూజారి కావలెను. గుడి వద్ద కాపురము ఉండగలవారు సంప్ర: 7382481816 [C-777439]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. (జీతం+ ఇన్సెంటివ్స్ కలవు) స్మార్ట్ ఫోన్ మరియు టూ వీలర్ కంపల్సరి. (వయస్సుతోసంబంధం లేదు) 9885969295, 9154803148 [C-777421]

■ Wanted Bachelor of Pharmacy or D.of Pharacy Degree holder candidate Contact: 9366287375, Location: Kadapa City. [C-777432]

■ Wanted Teachers: Primary EVS (1st to 3rd), Preprimary-Primary Incharge: English (3rd to 5th), High School: Maths-iiT (6th to 10th) Gowtham E.M. High School, Nagulakatta Street Jammala madugu. 9100403080, 8106109588 [C-777375]

■ డైరెక్ట్ జాబ్ 18-50 సంుల మహిళలు/ పురుషులు మా కంపెనీ కొరకు వెంటనే కావలెను. ఫ్రీ రూం + భోజనం, జీ॥ 18-30 వేల వరకు. మ్యాన్ పవర్ ఏజెంట్స్ కావలెను. 8886733008/005 [HA-10840]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ.15,000 -40,000/-, ఫ్రీ రూమ్+ భోజనం. HYD, Ph: 8919613984 [HA-911]

■ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ నందు పనిచేయుటకు పంప్ బాయ్స్ కావలెను. జీతం: 11,500, నియర్ RTC బస్టాండ్ దగ్గర, కడప. సంప్ర: 9705826592. [C-777433]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర: 9177736926 [G-824731]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



28 నుంచి సమ్మేటివ్-1

- 1-10 తరగతులకు ఎస్‌సీఈఆర్‌టీ ప్రశ్నపత్రాలు
- మండల కేంద్రాలకు పరీక్ష పేపర్లు సరఫరా



పరీక్షకు సిద్ధమవుతున్న పదోతరగతి విద్యార్థులు

మదనపల్లె సిటీ: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసేందుకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ) పరీక్ష షెడ్యూలును రాష్ట్ర విద్యా పరిశోధన మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) తాజాగా ప్రకటించింది. దీని ప్రకారం ఈనెల 28 నుంచి వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకు 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఎస్.ఏ-1 పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ప్రశ్నపత్రాలు సరఫరా చేశారు. ఈసారి టోఫెల్ పరీక్షలకు కూడా ప్రింటెడ్ ప్రశ్నాపత్రాలు సరఫరా చేశారు. 1 నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు బైలింగ్విష్ విధానంలో, పదో తరగతి వారికి మీడియం వారీగా ప్రశ్నపత్రాలపై ప్రతి జిల్లాకు సీక్రెట్ క్యూఆర్ కోడ్ కేటాయించారు. పేపర్లను ఎవరైనా లీక్ చేసినా, ఏ పాఠశాల నుంచి లీక్ అయినా విషయం క్షణాల్లో బయటపడే అవకాశం ఉండేలా చర్యలు చేపట్టారు.

- ఫార్మేటివ్ అసెస్‌మెంట్ 1 ,2 పరీక్షలు ఇప్పటికే పూర్తయాయ్యయి. గత ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం పరీక్ష పేపర్ల మూల్యాంకనం, పరీక్ష పేపర్లను విద్యార్థులకు ఇచ్చి, వారి తల్లిదండ్రుల సంతకాలు తీసుకునేందుకు, మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు షెడ్యూలు ఇచ్చారు. జనవరిలో ఫార్మేటివ్-3, మార్చిలో ఫార్మేటివ్-4, ఏప్రిల్‌లో 1 నుంచి 9 తరగతులకు ఎస్ఏ-2, మార్చిలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు.

పరీక్షల టైం టేబుల్..

- 1-5 తరగతులకు ఈనెల 28న తెలుగు, డిసెంబర్ 1న ఇంగ్లీష్, 2న గణితం, 4న పరిసరాల విజ్ఞానం, 5న ఇంగ్లీష్ పార్ట్-బి టోఫెల్ పరీక్ష
- 6-10 తరగతులకు ఈనెల 28న తెలుగు, డిసెంబర్ 1న హిందీ, 2న ఇంగ్లీషు, 4న గణితం.
- డిసెంబర్ 6న 8-10 తరగతులకు బీఎస్, 7న సోషల్ స్టడీస్, 8న ఇంగ్లీష్-పార్ట్-బీ టోఫెల్ పరీక్ష
- 1-5 తరగతులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు
- 6,8,10 తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు, 7,9 తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 వరకు పరీక్షలు జరుగుతాయి.
- 1-8 తరగతులకు 80 మార్కులకు, 9,10 తరగతులకు 100 మార్కులకు ప్రశ్నపత్రం ఇస్తారు.

తొలిసారి టోఫెల్ ప్రింటెడ్ పేపర్లు


ఇంగ్లీషులో విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించేందుకు ప్రభుత్వం టోఫెల్ విద్యను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు టోఫెల్ పరీక్షను ఐఎఫ్‌పీ,స్మార్ట్ టీవీలు పాఠశాలల్లో మాత్రమే నిర్వహిస్తున్నారు.

ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించగా తొలిసారి ప్రింటెడ్ పేపర్లను ఎస్‌సీఈఆర్‌టీ సరఫరా చేసింది. సాధారణ పరీక్షల మాదిరిగానే ఇకపై టోఫెల్ పరీక్షకు ప్రింటెడ్ పేపర్లలో విద్యార్థులు రాయనున్నారు. జిల్లాలో 30 మండలాల్లో 2213 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1,54,789 మంది విద్యార్థులున్నారు.

మండల కేంద్రాలకు పేపర్ల పంపిణీ

జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(ఈసీఈబీ) ద్వారానే ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో ఎస్ఏ-2 పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పరీక్ష పేపర్లను డీసీఈబీ ద్వారా మండల విద్యా కేంద్రాలకు సరఫరా చేశారు. వీటికి సంబంధిత ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు కస్టోడియన్‌లుగా వ్యవహరిస్తారు. పది పబ్లిక్ పరీక్ష పేపర్ల మాదిరిగానే పరీక్షల తేదీల వారీగా ప్రశ్నపత్రాలను ట్రంకు బాక్సుల్లో భద్రపర్చారు.

మార్గదర్శకాలు పాటించాలి



ఎస్ఏ-1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు కూడా షెడ్యూలు ప్రకారం సమ్మేటివ్ -1 పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలి. ఏ రోజు పేపరును అదే రోజు గంట ముందు మాత్రమే సీల్ చేసిన బాక్సుల నుంచి బయటకు తీస్తారు. పబ్లిక్ పరీక్షల మాదిరిగానే ఎస్ఏ-1 నిర్వహించాలి.

–శ్రీరాం పురుషోత్తం, జిల్లా విద్యాశాఖ అధికారి